

ఘనంగా పోచమ్మ బోనాలు

రుద్రంగి: మండల కేంద్రంలో గంగపుత్ర, మున్నూరు, గుడేటి కాపు, పెర్క సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు.



రాజన్న సేవలో..

వేములవాడ: రాజన్నను కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

గరిష్టం/కనిష్టం
36.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాలల హక్కులు గౌరవించాలి



విద్యార్థులతో ప్లకార్డుల ప్రదర్శనలో సీనియర్ సివిల్ జడ్జి రాధికాజైస్వాల్

సిరిసిల్లటౌన్: బాలల హక్కులను పౌరులందరూ గౌరవించాలని సిరిసిల్ల సీనియర్ సివిల్‌జడ్జి రాధికాజైస్వాల్ అన్నారు. బుధవారం సిరిసిల్ల కుసుమ రామయ్య పాఠశాలలో నిర్వహించిన హెల్పింగ్‌హార్ట్స్ బాల కార్మిక నిరోధక క్యాంపునకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడీడు పిల్లందరినీ చదివించి వారి బంగారు భవితకు పునాదులు వేద్దామన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిరోధంపై ముద్రించిన ప్లకార్డులను విద్యార్థులతో ప్రదర్శించారు. బాల కార్మికవ్యవస్థ నిర్మూలనపై చేపట్టిన సంతకాల సేకరణను ప్రారంభించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, హెల్పింగ్ హార్ట్స్ సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, బాలల సంక్షేమ సమితి చైర్మన్ కమటం అంజయ్య, సైకాలజిస్టు కనుకుంట్ల పున్నంచందర్, చింతోజు భాస్కర్, మోతీలాల్, వేముల మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి




పుస్తకాలు పంపిణీ చేస్తున్న జేడీ రాజీవ్

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు బడిబాట ద్వారా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర జేడీ (ఎస్ఎస్) పి.రాజీవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొదురుపాక హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్ తదితర సౌకర్యాలు ఉంటాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో సదరం శిబిరాలు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఈనెల 26, 27 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్ తెలిపారు. 26న వినికిడి, ఆర్థోపెడిక్, 27న మానసిక, కంటిచూపు వైద్యులు పరీక్షలు చేస్తారని అన్నారు. జిల్లాలోని దివ్యాంగులు మీ సేవ కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకుని ఆధార్‌కార్డు, మెడికల్ సర్టిఫికెట్లు, ఫొటోలతో రావాలని కోరారు.

బెటాలియన్‌లో ఇంటర్వ్యూలు పూర్తి



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు పూర్తి చేసినట్లు బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. 23 ఉద్యోగాలకు 120 మంది అభ్యర్థులు హాజరయ్యారని అన్నారు. 13వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమిల్ భాష హాజరు కాగా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రమీల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపిక కాని అభ్యర్థులు నిరాశపడకుండా మళ్లీ అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ

సిరిసిల్లకల్చరల్: అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందేందుకు అర్హులైన జిల్లాలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన న్యాయ విద్య పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీడీవో వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన పట్టభద్రులకు రూ.3వేల స్టయిఫండ్, పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలు నిమిత్తం రూ.50వేలు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి గల లాయర్లు ఆన్‌లైన్‌లో తమ వివరాలు పొందుపరచాలన్నారు. 35 ఏళ్లలోపు వయస్సు, రూ.2లక్షలకు మించని వార్షికాదాయం, బ్యాంక్ ఖాతా, విద్యార్హతల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జూలై 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, మిగిలిన వివరాల కోసం ఎస్సీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చినుకు.. వణుకు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది వేములవాడ మల్లారంరోడ్డులోని ప్రాంతం. కట్టుకాలువ పరిసర ప్రాంతాల్లో ఉండటంతో ఏటా వరద నీరు చేరుతోంది. ఈఏడాది సైతం వర్షాలు ఎక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తుండటంతో తమ పరిస్థితి ఏమిటో అంటూ సుమారు 40 గృహాల యజమానులు బెంబేలెత్తిపోతున్నారు. ఏటా వరదలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు స్పందించి కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారని, ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఈ వర్షాకాలంలోనైనా తమకు రక్షణ కల్పించేందుకు కాలువలు శుభ్రం చేయించాలని ప్రాధేయపడుతున్నారు.



- సిరిసిల్లలో లోతట్టు ప్రాంతాల్లో హైటెన్షన్
- వేములవాడలో ఆగమాగమవుతున్న శివారు కాలనీల జనం
- వర్షాకాలం పోటెత్తే సమస్యపై ఆవేదన
- తాత్కాలిక చర్యలతో సమస్య తీరేనా..
- శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు



వర్షం పడితే పాత బస్టాండు పరిస్థితి

సిరిసిల్లటౌన్/వేములవాడ: చినుకు పడితే కార్మిక క్షేత్రం సిరిసిల్ల, వేములవాడ శివారు కాలనీల జనం వణుకుతోంది. వర్షాకాలంలో వరుసగా వస్తున్న వరదలు ప్రజలను భయపెడుతున్నాయి. రెండేళ్ల క్రితం జరిగిన ప్రాణ, ఆస్తినష్టం నుంచి ఇంకా తేరుకోలేదు. పై ప్రాంతాల్లోంచి వచ్చే వరదనీరును కట్టడి చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం ఏళ్ల తరబడిగా కుస్తీ పడుతోంది తప్ప సమస్య తీరడం లేదు. మూడ్రోజులుగా కురుస్తున్న చిన్న పాటి జల్లులకే లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు పోటెత్తింది. అధికారులు, పాలకులకు రాబోయే ముప్పుపై కనువిప్పు కలగాలని స్థానికులు కోరుతున్నారు.

సిరిసిల్లలో సమస్యలు ఇలా..

- సిరిసిల్లలో వరదలు రాకుండా రూ.2.50 కోట్లతో చేపట్టిన కాల్వలు, రోడ్ల పనులు పూర్తికాకపోవడం విమర్శలకు తావిస్తోంది.
- శాంతినగర్ నుంచి శ్రీనగర్ గుండా వరద కాల్వ నిర్మాణ పనులు పూర్తికాలేదు.
- రాబోయే వరదలపై శాశ్వత పరిష్కార చర్యలు లేకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.
- చెరువుల ఆక్రమిత నాలాలు, మత్తడి కాల్వలు పునరుద్ధరిస్తే సమస్య పరిష్కారం అయ్యే అవకాశంపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలి.
- లోతట్టు ప్రాంతాలైన అంబికానగర్, వెంకంపేట, తారకరామనగర్, పద్మనగర్, అశోక్‌నగర్, అనంతనగర్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, ఆసిఫ్‌పుర, ఆటోనగర్, శాంతినగర్‌లకు వరద చేరకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.
- పాతబస్టాండ్ సమీపంలో రూ.45 లక్షలతో నిర్మించిన ప్రధాన డ్రెయినేజీ కాల్వపైనుంచి వరద నీటిని రోడ్డుపైకి రానీయకుండా పునరుద్ధరించాలి.
- కబ్జాలకు గురైన నాలాలను అధికారులు స్వాధీనం చేసుకొని వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.
- ప్రధాన మురుగుకాల్వల్లో సిల్టు పేరుకుపోకుండా శుభ్రం చేయాలి.
- లోతట్టు ప్రాంతాలకు ముంపు వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికతో కొత్త నాలాలు నిర్మించాలి.



గతేడాది వరదల్లో చిక్కుకున్న శ్రీనగర్ కాలనీ

వేములవాడలో..

- కొన్నేళ్లుగా అతివృష్టిగా మారిన వర్షాలు వేములవాడ శివారు కాలనీల జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.
- మల్లారంరోడ్డు, రెండో బైపాస్‌రోడ్డు, కోనాయపల్లి రోడ్డులోని నివాసాల్లోకే వరదనీరు వచ్చి చేరుతుంది.
- బుడగ జంగాల కాలనీ, మల్లారంరోడ్డు కాలనీల్లోని జనం ఇల్లు వదిలి వెళ్లాల్సి వస్తోంది.
- కాలువలు సక్రమంగా లేకపోవడం, అతిగా వర్షాలు కురవడంతో వరద నీరంతా ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయంతో కాలం వెల్లదీస్తున్నారు.
- నిత్యం టీవీల్లో వాతావరణశాఖ హెచ్చరికలతో శివారు కాలనీల జనం ఇప్పటి నుంచే వణికిపోతున్నారు.
- నాలుగేళ్లుగా అధికారులు వరదలొచ్చినప్పుడే స్పందిస్తూ పునరావాస చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

పనులు చేపడతాం



వరదలతో ప్రజానీకం ఇబ్బంది పడకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే శాశ్వత పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇటీవల బుడగ జంగాల కాలనీలో ఇరిగేషన్ అధికారులతో కాలువ శుభ్రం చేయించాం. మల్లారంరోడ్డులోని బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వరదనీరు మూలవాగులోకి వెళ్లేందుకు చర్యలు తీసుకుంటాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

మున్సిపాలిటోళ్లు మరిచింద్రు..



పాతబస్టాండులోని పెద్ద మోరి నిండింది. వర్షం పడితే మురుగునీరంతా పెద్దబజార్ వరకు రోడ్డుపై నిలుస్తోంది. వాన పడితే మూడ్రోజులు మాకు తిప్పలే. మోరి కట్టడంపై మున్సిపాలిటోళ్లు మరిచిపోయింద్రు.

– ఒటారికారి శ్రీనివాస్, చేతివృత్తి దారుడు

లక్షల్లో ఆస్తి నష్టపోయాం



ఏళ్ల తరబడిగా వెంకంపేట పైప్రాంతం నుంచి వరదలు పోటెత్తుతున్నాయి. మా దుకాణాలకు రెండేళ్ల వరుసగా నీరొచ్చి చేరింది. లక్షల్లో ఆస్తి నష్టపోయాం. మా ఏరియాల్లో నాలాలు సరిగా లేవు. డ్రైనేజీల్లో సిల్టు నిండింది. డ్రైనేజీలు మరమ్మతు చేసి వరద నీరంతా సులువుగా పోయేట్లు చేయాలి.

– కాసనగొట్టు శ్రీనివాస్, వ్యాపారి, వెంకంపేట

శాశ్వత పరిష్కారం చూపాలి



చిన్న వర్షానికే ఏరియా మొత్తం నీటితో నిండిపోతుంది. వర్షం మొదలైందంటే దుకాణం మూసుకుని ఇంటికి పోయే పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. డ్రైనేజీ నీటితో పాటుగా బురద, చెత్తంతా పేరుకుపోతుంది. మూడ్రోజులు పాటు అవస్థలు పడాల్సివస్తుంది.

– కూనపల్లి రాజేందర్, చిరువ్యాపారి, బస్టాండు ఏరియా

తాత్కాలిక చర్యలే..



శివారు కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరదలతో ఇబ్బంది పడుతున్నాం. నాలుగేళ్లుగా శాశ్వత పనులు చేపడతామంటూ వస్తున్న అధికారులు తాత్కాలిక చర్యలతోనే సరిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా తమకు రక్షణ కల్పించాలి.

– బాబు, కాలనీవాసులు, మల్లారంరోడ్డు, వేములవాడ

ఉదరకాల్వ పూర్తయింది



సుందరయ్యనగర్ నుంచి కొత్తచెరువు వరకు నిర్మించిన ఉదరకాల్వ పనులు పూర్తయ్యాయి. డ్రైనేజీలు పొంగే ఏరియాల్లో ఏడేళ్ల నుంచి తొలగించని సిల్టును తీయించాం. శ్రీనగర్‌లో కొంతమేరకు కాల్వ పనులు జరుగాల్సి ఉంది. వర్షాకాలం ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాం.

– జిందం కళ, మున్సిపల్ చైర్‌పర్సన్, సిరిసిల్ల

జిల్లాలో దంచికొట్టిన వానలు



సిరిసిల్ల నేతన్న చౌక్‌లో రోడ్డెక్కిన మురుగును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున వానలు దంచికొట్టాయి. భారీ వర్షాలతో సిరిసిల్లలోని పాత బస్టాండ్ నేతన్న చౌక్ వద్ద మురుగు నీరు రోడ్డెక్కింది. వర్షాలకు వెంకంపేట, సర్ధార్‌నగర్, ప్రగతినగర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు వెళ్లేందుకు మురుగు కాల్వ ఇరుకుగా ఉండడంతో మురుగు నీటితో కలిసి వర్షం నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో దుర్వాసన వ్యాపించింది. ఉదయం పూట మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది రోడ్డుపైకి చేరిన మురుగును తొలగించారు. సంజీవయ్యనగర్ వెళ్లే దారిలోనూ మురుగునీరు రోడ్డుపైకి చేరింది. అత్యధికంగా చందుర్తిలో 43.1 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 3.2, వేములవాడ రూరల్‌లో 4.6, బోయినపల్లిలో 1.1, వేములవాడలో 2.3, సిరిసిల్లలో 11.2, కోనరావుపేటలో 2.3, వీర్నపల్లిలో 4.9, ఎల్లారెడ్డిపేటలో 18.4, ముస్తాబాద్‌లో 1.9, తంగళ్లపల్లిలో 16.1, ఇల్లంతకుంటలో 1.5, అత్యల్పంగా గంభీరావుపేటలో 0.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఓ మోస్తారు భారీ వర్షాలు పడడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అర్బన్ పాలకవర్గాన్ని సన్మానించిన కేటీఆర్



సిరిసిల్లటౌన్: నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల సహకార అర్బన్‌బ్యాంకు పాలకవర్గాన్ని ఎమ్మెల్యే కె.తారకరామారావు బుధవారం ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ మద్దతుతో ఎన్నికైన అర్బన్‌బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, పాటి కుమార్ రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాసు, ఎనగందుల శంకర్, వలస హరిణిలను శాలువాలు కప్పి అభినందించారు. పటిష్ట ప్రణాళికతో బ్యాంకును మరింత అభివృద్ధిలో నడిపించాలని, తన సహకారం ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

సినారె ఓ మహోన్నత వ్యక్తి

- నాటి నుంచి నేటి తరానికి రచనలు ఆదర్శం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: సాహిత్యరంగంలో అగ్రభాగాన నిలిచిన కవిగానే కాక ఓ మహోన్నత వ్యక్తిగా డాక్టర్ సినారెకు పేరుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని హన్మాజీపేటలో గల సి.నారాయణరెడ్డి నివాస ప్రాంగణంలో ఉన్న కవితా కర్పూరక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఏడో వర్ధంతిలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణాకు ప్రపంచంలో గొప్ప పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టి జ్ఞానపీఠ పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు. సినారె ఎంపీగా ఉన్న సమయంలో అందించిన అభివృద్ధి నిధులతో అనేక గ్రామాలకు తాగునీటికి బోరుబావులు ఏర్పాటు చేశారని వివరించారు. శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ మల్లేశం మాట్లాడుతూ హన్మాజీపేటలో జన్మించిన నేను బాల్యం నుంచి డాక్టర్ సినారె స్ఫూర్తితో ఎదిగినట్లు తెలిపారు. సుశీల నారాయణ ట్రస్టు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య అతిథులకు స్వాగత ఉపన్యాసం చేస్తూ పాతికేళ్ల వయస్సులో డాక్టర్ సినారె కర్పూరవసంతరాయలు అనే గేయ కావ్యం రచించారని ఆ స్ఫూర్తితోనే తర్వాత స్మృతివనానికి కవిత కర్పూర క్షేత్రం అని పేరు పెట్టినట్లు తెలిపారు. సభ సమన్వయ కర్తగా నేషనల్ బుక్ ట్రస్టు ఇండియా దక్షిణ ప్రాంతీయ అధికారి డాక్టర్ మోహన్ వ్యవహరించారు. కార్యక్రమంలో కళాకారుల ఆటపాటలు పలువురి ఆకట్టుకున్నాయి. సమావేశానికి ఎంపీటీసీ శ్యామల, కుటుంబీకులు ఏ.భాస్కర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, గంగా, కృష్ణవేణి, కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం గౌడ్, సంగ స్వామి, రాజు, తిరుపతిరెడ్డి, ఈల రత్న గడ్డం నర్సయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

- సిబ్బంది సంక్షేమానికి కృషి
- ఎస్పీ అఖిల్ మహాజన్



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: శాంతిభద్రత పరిరక్షణలో నిత్యం పనిలో ఉండే పోలీసులకు క్రీడలతో ఒత్తిడి దూరమవుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును బుధవారం ప్రారంభించారు. జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండేందుకు క్రీడా సదుపాయాలు కల్పించామన్నారు. గెలుపు ఓటములను స్వీకరించే క్రీడా స్ఫూర్తిని ఉద్యోగ బాధ్యతల్లోనూ చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు మాధూకర్, యాదగిరి, రమేశ్, సీఐ రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోలీసు మెగా జాబ్ మేళా

జిల్లాలో ఉద్యోగార్థులకు బాసటగా నిలిచి అర్హులైన వారికి ఐటీ, నాన్ ఐటీలో ఉద్యోగాలు అందించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారి వెంట ఉన్న కల్యాణలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందన్నారు. 60 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. యువతను చెడువ్యసనాల నుంచి మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే జాబ్ మేళా జరుగుతుందని, దీనిని జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాల చదువు మరుపురానిది

- 'పది'లోపు పటిష్ట పునాది
- పలువురి మనోగతం



పాఠశాల ప్రారంభం రోజున బడికి వెళ్తున్న విద్యార్థులు

సిరిసిల్లఎడ్యుకేషన్: వేసవి సెలవులు ముగిశాక పాఠశాలకు వెళ్లడానికి కాస్త బాధగానే ఉండేదని, అమ్మమ్మ, నాన్నమ్మ వాళ్ల ఇళ్లకు వెళ్లి తిరిగి మళ్లీ బడి వెళ్లడానికి ససేమిరా అనడం పరిపాటిగా జరిగేదని అప్పటి కమ్మదనపు ఆలోచనలు వివరించారు ఇప్పుడు పెద్ద కొలువులో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు. కానీ పాఠశాలలో పదిలోపు చదివిన చదువు భవిష్యత్ పదిలంగా ఉండేందుకు ఉపయోగపడుతుందని అంటున్నారు. పాఠశాలలో ఉన్న స్నేహితులు, సార్లు మనతో ఉండే స్నేహపూర్వక వాతావరణం తర్వాత ఏర్పడిన స్నేహితుల కంటే అధికంగా ఉంటుందంటున్నారు. పాఠశాల చదువు అంటే ప్రాణం ఉన్నంత వరకు గుర్తుండే ఒక అద్భుత ఘట్టంగా ఫీలవుతున్న తమ మనసులోని స్పందన వారి మాటల్లోనే..

మేనమామలతో బడికి..



రుద్రంగిలోని అమ్మమ్మ ఇంటి నుంచే నేరుగా తల్లి లక్ష్మీబాయితో కలిసి మొదటిసారి 1971లో బండమీది సర్కారుబడిలో చేరా. పలకా, బలపంతో దోస్తు లక్ష్మీనారాయణ, బావ శ్రీనివాస్‌లతో కలిసి మొదటి తరగతిలో జాయిన్ అయ్యా. 1970లో పీసరి రాజం సార్ వద్ద కొద్ది రోజులు ఓనమాలు నేర్చుకున్న. బండమీది పెద్దబడిలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న. బడి నుంచి రాగానే ఆటలపైనే మక్కువ చూపేవారం. ఆ తర్వాత మేనమామలు పుప్పాల ప్రభాకర్, పుప్పాల భాస్కర్‌లతో కలసి నిత్యం బడికి వెళ్లేవారం. రాంకిషన్ సారు, గోవిందరెడ్డి సార్లు తనకు ఓనమాలు పెట్టించారు.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

పాఠశాల రోజులు చెప్పలేనివి



నేను పాఠశాల విద్యనందుకునే సమయంలో ఉన్న నిబంధనలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. పిల్లలను క్రమశిక్షణగా ఉంచేందుకు ఉపాధ్యాయులకు దండించే అవకాశాన్ని తల్లిదండ్రులే ఇచ్చేవాళ్లు. నేడు ఆ పరిస్థితి మారింది. పిల్లలపై మమకారం పెరిగి అసలు ఏమి అనొద్దు అనే పరిస్థితి వచ్చింది. అలాగే విద్యాశాఖ నిబంధనలు కూడా పాఠశాలలో దండించే విధానాలు ఉండకూడదని చెబుతున్నాయి. నేను నాన్నతో పాఠశాలకు వెళ్లిన రోజుల ఆనందం మాటల్లో చెప్పలేనిది. పాఠశాలలో ఫిజిక్స్ టీచర్ సోనియా అంటే అభిమానం అధికంగా ఉండేది.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, సిరిసిల్ల

పాఠశాలకు సంతోషంగా..



నేను చదుకునే రోజుల్లో అసలు పాఠశాలకు వెళ్లను అనే సందర్భాలు రాలేదు. అప్పటి రోజుల్లో ఏదేని చదవకుంటే కొట్టే విధానాలు ఉండేవి. వాటితో బడిమానేసి వాళ్లు అనేక మంది ఉండగా.. కొందరు బాగుపడిన వాళ్లు ఉన్నారు. నేడున్న పిల్లల మనస్తత్వాన్ని బట్టి బోధన చేయాల్సిన అవసరం వచ్చింది. అందుకే సైకాలజీ విద్యనభ్యసించే వారితో పాఠ్యాంశాల బోధనతో పాటు పరివర్తనలో మార్పు కోసం ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. గణితం బోధించే ఉపాధ్యాయులపై చాలా అభిమానం ఉండేది.

– రమేశ్, జిల్లా విద్యాధికారి, సిరిసిల్ల

ఉగ్రఘాతుకంపై నిరసన



సిరిసిల్లటౌన్: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఘాతుకాన్ని వీహెచ్‌పీ ఖండించింది. బుధవారం సాయంత్రం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టి మృతి చెందిన వారికి నివాళి అర్పించింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్ మాట్లాడుతూ వైష్ణోదేవి కత్రా నుంచి శివ్ ఖోడీకి వెళ్తున్న యాత్రికులపై హింసాకాండకు పాల్పడటం శోచనీయమన్నారు. నాయకులు సురేష్, హరికృష్ణ, రాహుల్, అభి, అనిల్, రాజు, హరీశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నతులుగా ఎదగాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్ల: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతులుగా ఎదగాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. బడిబాటలో భాగంగా బుధవారం నెహ్రూనగర్, గీతానగర్ స్కూళ్లలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. గత ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేసిందని, కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ఒకే చోట కాంప్లెక్స్‌లు నిర్మించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు మన ఊరు మన బడి కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా విద్యకు ప్రాధాన్యం ఇస్తూ వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి, డీఈవో రమేశ్, డీఆర్‌డీవో శేషాద్రి, ఎంఈవో రఘుపతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రుక్మిణి, పాఠశాల హెచ్‌ఎం భాగ్యరేఖ, సెక్టోరియల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పూసాల రోడ్డులో నివాసం ఉంటున్న రెడ్డి రమేశ్(37) మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. రెడ్డి రమేశ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం క్రితం మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి రావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా భార్యతో గొడవ జరిగింది. దీంతో ఆమె తన పిల్లలను తీసుకుని సమీపంలో వేరే ఇంట్లో నివాసం ఉంటున్న అత్యామామల వద్దకు వెళ్లింది. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా రమేశ్ ఉరివేసుకుని కనిపించగా బోరున విలపించింది. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

యువతి బలవన్మరణం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని కూనారం రోడ్డులో బుధవారం గుంజి శిరీష(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వరంగల్ జిల్లా హసన్‌పర్తికి చెందిన శిరీష 10రోజుల క్రితం పెద్దపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఆమె ఆత్మహత్యకు గలవివరాలు తెలియాల్సి ఉంది. అయితే, మృతురాలి కుటుంబసభ్యులను విచారిస్తేనే వివరాలు తెలిసే అవకాశం ఉందని ఎస్సై మల్లేశ్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి


అశ్విత (ఫైల్)

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన సముద్రాల అశ్విత (14) విద్యుత్‌షాక్‌కు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం అశ్విత మంగళవారం రాత్రి ఇంట్లోని బాత్రూంలోకి వెళ్లి బయటకు వస్తుండగా బాత్రూం డోర్‌కు విద్యుత్ ప్రసరించి షాక్‌కు గురైంది. ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అశ్విత స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతిలో చేరింది. తండ్రి సతీశ్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. తల్లి సునిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లొస్తూ..

- గుండెపోటుతో కాంగ్రెస్ నాయకురాలి మృతి


సుజాత (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): అమర్‌నాథ్ యాత్రకు వెళ్లొస్తూ కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లివాసి, కాంగ్రెస్ నాయకురాలు తుల సుజాత(60) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సుజాత యాత్రికులతో కలిసి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం రిషికేశ్ సమీపంలో గుండెపోటు రావడంతో చనిపోయారు. ఆమె భర్త, మొట్లపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్‌రావును కొన్నేళ్ల కిందట మావోయిస్టులు కాల్చి చంపడంతో కరీంనగర్‌లో నివాసం ఉంటోంది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భర్త మృతి అనంతరం మండల ప్రజల ఒత్తిడి మేరకు సుజాత కాంగ్రెస్ తరఫున కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీగా పోటీ చేసి, ఓడిపోయారు. సుజాత మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు బంధువులు రిషికేశ్ బయలుదేరి వెళ్లారు.

ఆయిల్‌పాం సాగు భేష్

- జగిత్యాల జిల్లాలో పర్యటించిన విదేశీ శాస్త్రవేత్తలు
- ఫ్రాన్స్, మలేసియా, ఇండోనేషియా నుంచి రాక
- స్వాగతం పలికిన స్థానిక ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


హాజరైన రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లాలో ఆయిల్ పాం సాగు బాగుందని ఫ్రాన్స్, మలేసియా, ఇండోనేషియా దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు కితాబునిచ్చారు. ఆయా దేశాల నుంచి విత్తనాలు, మొలకలు తీసుకొచ్చి ఇక్కడి నర్సరీల్లో పెంచి రైతులకు అందిస్తున్న విషయం తెల్సిందే. ఈ క్రమంలో సాగు చేస్తున్న తోటల తీరుతెన్నులను తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి స్థానిక ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయిల్ పాం సాగు చేసిన రైతుల తోటలను ఉద్యానశాఖ, కంపెనీ అధికారులు నెలకోసారి సందర్శించాలని, రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఆయిల్ పాంకు మద్దతు ధర లేదని, అంతర్జాతీయంగా ధరలు తగ్గితే రైతులు నష్టపోయే అవకాశం ఉందని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేయాలని జీవన్‌రెడ్డి కోరారు. బైబ్యాక్ అగ్రిమెంట్ లేకపోవడం ద్వారా రైతులు కంపెనీల చేతిలో కీలుబొమ్మలుగా మారే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఎత్తివేయడంతో పామాయిల్ సాగు చేసే రైతులపై ప్రభావం చూపనుందని తెలిపారు. పామాయిల్ ధర విషయంలో అనుమానాలు ఉన్నాయని, పంట వచ్చినప్పుడు ధర ఇబ్బందిగా మారే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ ఇండోనేషియా, మలేసియా వంటి చిన్న దేశాలు అయిల్ పాంను అత్యధికంగా ఉత్పత్తి చేసి మన దేశానికి ఎగుమతి చేస్తున్నాయని, ఇందుకు మన దేశం 11,000 కోట్ల డాలర్లు చెల్లిస్తున్నామంటే పరిస్థితిని ఊహించుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పాం సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని వివరించారు. రైతులకు 1993 యాక్ట్ ప్రకారం కంపెనీలు మొక్కలు సరఫరా చేసి ఆయా కంపెనీలే పంటను కొనుగోలు చేస్తాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటుకే కొనుగోలు చేస్తాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీలు హాజరయ్యారు. మద్దతు ధరపై జీవన్ రెడ్డి మాట్లాడుతుండగా కొందరు రైతులు ఆయిల్ పాం రైతులను నీరుగార్చుతున్నారని, రాష్ట్రంలో ఉన్నది తమ ప్రభుత్వమేనని, మద్దతు ధర ఇప్పించాలని సూచించారు. మలేసియా శాస్త్రవేత్త నికోలస్ టన్‌బల్ మాట్లాడుతూ.. ఆయిల్ పాం నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి వస్తుందన్నారు. 1990 సంవత్సరం నుంచి మలేసియా నుంచి పొట్టి జాతి, తక్కువ ఆకు ఉన్న విత్తనాలను సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఫ్రాన్స్ శాస్త్రవేతక్త జైవర్ లాకాన్ మాట్లాడుతూ.. ఆయిల్ పాంను రానున్న రోజుల్లో బయోడీజిల్‌గా ఉపయోగించే అవకాశం ఉందన్నారు. ఇండోనేషియా శాస్త్రవేత్త శ్రీవైజియన్ మాట్లాడుతూ జగిత్యాల, కరీంనగర్ జిల్లాల వాతావరణం ఆయిల్ పాం సాగుకు అనుకూలంగా ఉందన్నారు. మరో శాస్త్రవేత్త షారుత్ షోలతస్ మాట్లాడుతూ విత్తనాలను ఆధునిక టెక్నాలజీతో రూపకల్పన చేస్తున్నామని, తమ దేశం నుంచి మొలకెత్తిన విత్తనాలను సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఆయిల్ పాం టెక్నికల్ కన్సల్టెంట్ రంగనాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతినెలా రేటును నిర్ణయిస్తుందని, ఆ ప్రకారమే కంపెనీలు తప్పనిసరిగ్గా కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి 15 కిలోమీటర్లకు ఓ కలెక్షన్ సెంటర్ ఏర్పాటవుతుందన్నారు.

ఇసుక రవాణాపై పోలీసుల కొరడా

- 12 లారీల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..


పట్టుబడిన లారీలు

సిరిసిల్లక్రైం: ఇసుక అక్రమ రవాణాపై సిరిసిల్ల పోలీసులు కొరడా ఝుళిపించారు.ఇసుక అక్రమంగా తరలిస్తున్న 12 లారీలను సిరిసిల్ల టౌన్ పోలీసులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఇసుక రవాణాలో జరుగుతున్న అక్రమాలు, అధిక స్పీడ్, ఓవర్‌లోడ్ వంటి అంశాలపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అదే రోజు రాత్రి తనిఖీలు చేపట్టడంతో సిరిసిల్ల బైపాస్ మీదుగా వెళ్తుండగా 12 లారీలను పట్టుకొని బతుకమ్మ తెప్పవద్దకు తీసుకెళ్లారు. ఇందులో వేబిల్లు లేకుండా, కాగితాలు సరిగా లేని రెండు లారీలపై కేసు నమోదు చేసిన పోలీసులు, మరో 8 లారీల్లో ఓవర్ లోడ్ ఉండటాన్ని గమనించి జరిమానా విధించేందుకు మైనింగ్, ఆర్టీఏ అధికారులకు వాహన వివరాలు అందించారు. మరో రెండు లారీలకు అన్ని సజావుగా ఉండడంతో వదిలేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఈ లారీలు కాళేశ్వరం క్వారీ నుంచి ఇసుకను హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక రవాణా చేస్తే చట్టపరిధిలో కేసు నమోదు చేస్తామని సీఐ రఘుపతి వెల్లడించారు.

ఇసుక లారీలపై నజర్

తంగళ్లపల్లి: లారీల్లో ఇసుకను అక్రమంగా, తరలించడంపై పోలీసులు నజర్ పెట్టారు. బుధవారం మండలకేంద్రం గుండా వెళ్తున్న సుమారు పది ఇసుక లారీలను పట్టుకొని వాటిని తాడూర్‌లోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌కు తరలించారు. అయితే వేబిల్లులు లేకుండా, అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలపై పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇసుక లారీలను సీజ్ చేయడంపై పోలీస్ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. త్వరలోనే వివరాలను పై అధికారులు వెల్లడించే అవకాశం ఉందని కిందిస్థాయి పోలీస్ సిబ్బంది చెబుతున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేస్తున్న రాకేశ్

వెల్గటూర్ : తనకు న్యాయం చేయాలంటూ ఓ యువకుడు వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించిన ఘటన వెల్గటూర్ మండలకేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గాజుల లచ్చయ్య, గాజుల రాకేశ్‌పై కొంతమంది యువకులు గతనెల బీర్ సీసాలతో దాడిచేశారు. దీంతో పోలీసులు నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నిందితుల్లో ముగ్గురు బెయిల్ తెచ్చుకున్నారు. ఒకరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. అయితే ఘటన జరిగి నెల గడిచినా నిందితులను పట్టుకోవడం లేదని, తనకు అన్యాయం జరుగుతోందని రాకేశ్ బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులందరూ ఎన్నికల విధుల్లో ఉండడంతో ఆలస్యమైందని, నాలుగు రోజుల్లో నిందితులను పట్టుకుంటామని సీఐ రాంనర్సింహారెడ్డి హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- విదేశాలకు వెళ్లాలనుకుంటే.. అంతలోనే
- మృతులు కామారెడ్డి జిల్లావాసులు


సయ్యద్ చాంద్ (ఫైల్)


షేక్ అబ్దుల్లా (ఫైల్)


వ్యాన్ కింద మృతదేహాలు

గంభీరావుపేట(సిరిసిల్ల): వారిద్దరూ బతకుదెరువు కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నారు. కానీ అంతలోనే రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతంలో సిరిసిల్ల, కామారెడ్డి ప్రధాన రహదారిపై డీసీఎం, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో బుధవారం కామారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్లా (32), సయ్యద్ చాంద్ (40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిరోజులుగా ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. వీసా ప్రయత్నంలో భాగంగా సిరిసిల్లలో ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు ఇంట్లోంచి బుధవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై బయలుదేరారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతంలో సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న డీసీఎం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో షేక్ అబ్దుల్లా, సయ్యద్ చాంద్ అక్కడికక్కడే మృతిచెందారు. వ్యాన్ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ పేర్కొన్నారు.

ఎద్దుల పట్టివేత

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వ్యాన్‌ను బుధవారం ఎస్సై స్వామి పట్టుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల నుంచి వ్యాన్‌లో 18ఎద్దులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎద్దులతో హైదరాబాద్ షాద్‌నగర్‌కు వెళ్తున్న వ్యాన్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎద్దులను సుల్తానాబాద్‌లోని గోశాలకు తరలించి విచారణ చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

భారీగా సింగరేణి స్క్రాప్ పట్టివేత


స్క్రాప్ చూపుతున్న సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లోని స్క్రాప్ దుకాణంపై సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్ అండ్ పీసీ సిబ్బంది బుధవారం ఆకస్మాత్తుగా దాడి చేశారు. ఈ సందర్భంగా సింగరేణికి చెందిన సుమారు 6.96టన్నుల స్క్రాప్ గుర్తించారు. దీని విలువ సుమారు రూ.1.39లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈమేరకు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, అక్బర్‌అలీ, చంద్ర శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'రీయింబర్స్‌మెంట్' విడుదల చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్


మాట్లాడుతున్న ప్రకాశ్

కరీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం పూర్తయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖలోనే రూ.114 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని వారిపై ఒత్తిడి చేస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్లు రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మదాసు సంజీవ్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ.48.67 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తుల ద్వారా వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఇందులో రూ.48,67,803 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. మార్చి 30 నుంచి 74 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.48,67,803తోపాటు 120 గ్రాముల మిశ్రమ బంగారం, 6.450 కిలోల మిశ్రమ వెండి, 20 విదేశీనోట్లు సమకూరినట్లు తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

రామగుండం ఎన్టీపీసీలో ప్రమాదం

- ఒడిశాకు చెందిన కాంట్రాక్టు కార్మికుడి మృతి


అర్జున్ (ఫైల్)


సీపీఆర్ చేస్తున్న మెడికల్ సిబ్బంది

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు అర్జున్ మరాండి(37 మృతి చెందాడు. ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బస్తా సబ్ జిల్లా ముకులిసి గ్రామానికి చెందిన అర్జున్ మరాండి.. ఎన్టీపీసీలోని ప్రభాత్ ఇంజనీరింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్–6 ఈఎస్పీ, పాస్–డి వద్ద పనులు జరుగుతున్న క్రమంలో 5 మీటర్లకుపైగా ఎత్తు నుంచి అకస్మాత్తుగా కిందపడిపోయాడు. కార్మికుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న ధన్వంతరీ ఆస్పత్రి ఎమర్జెన్సీ మెడికల్ సభ్యులు అర్జున్ మరాండికి సీపీఆర్ చేశారు. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని ధన్వంతరీ ఆస్పత్రికి తరలించారు. సీఐ అజయ్‌బాబు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అర్జున్ మరాండి మృతదేహాన్ని ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలపై విజిలెన్స్ బృందం అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

మాజీ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు!

కరీంనగర్ క్రైం: గంగాధర మాజీ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శివారపు సురేశ్‌బాబు గత ఏప్రిల్‌లో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి, ఆయనను కరీంనగర్ జైలుకు తరలించారు. కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి, భారీగా నగదు, బంగారు ఆభరణాలు, వివిధ ఆస్తులను గుర్తించి, ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

- ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్


సర్టిఫికెట్స్ అందిస్తున్న సీజీఎం సుధీర్‌కుమార్

రామగిరి(మంథని): పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం సెంటినరీకాలనీ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంకేతికత, ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. అనంతరం ఇంజినీరింగ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి దుర్గారావు, సూపరింటెండెంట్ రవికుమార్, డీఈఈ సతీశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పుస్తకాలు తయారు చేస్తున్న వ్యక్తి రిమాండ్

కోనరావుపేట: తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఓ వ్యక్తి నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు తయారుచేస్తుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... కోనరావుపేట మండలకేంద్రానికి చెందిన ముస్కూరి కాశీరాం గతంలో తహసీల్దార్ కార్యాలయంలో సుంకరిగా పనిచేశాడు. భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకున్న కాశీరాం కోనరావుపేటకు చెందిన దండుగుల కనుకయ్యకు మూడెకరాల భూమి పట్టా చేయిస్తానని చెప్పి అతని వద్ద రూ.లక్ష తీసుకొని, నకిలీ రెవెన్యూ ముద్రలు వినియోగించి పాతరకం పట్టాదారు పాస్‌పుస్తకాన్ని తయారు చేసి ఇచ్చాడు. అతడు భూమిని దున్నగా అటవీ అధికారులు భూమి తమదేనని అడ్డుకున్నారు. సదరు భూమిని ధరణిలో నమోదు చేయిస్తానని చెప్పి రూ.20 వేలు, మరోసారి రూ.10 వేలు తీసుకొని కనుకయ్యను మోసం చేశాడన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడు. అతని ఇంట్లో పోలీసులు దాడిచేయగా 10 పట్టాదారు పాస్‌బుక్‌లు, 6 టైటిల్ డీడ్ బుక్‌లు లభించగా వాటిని సీజ్‌చేశారు. కాశీరాంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి


సతీశ్ (ఫైల్)


రోడ్డుపై సతీశ్ మృతదేహం

చొప్పదండి: చొప్పదండి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముగాట్ గ్రామానికి చెందిన సతీశ్ మారుతి గాడ్‌బోలే (25) మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు.. జూలపల్లి మండలం కాచాపూర్‌లో రామడుగు మండల కేంద్రానికి చెందిన ఊట్కూరి అనిల్ రెడ్డి చికెన్ సెంటర్‌లో సతీశ్ రెండేళ్లుగా పని చేస్తున్నాడు. రామడుగులో మంగళవారం వారసంత ఉండటంతో అన్న అర్జున్ మారుతి దగ్గరకు వచ్చాడు. బుధవారం ఉదయం సతీశ్‌తోపాటు అనిల్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న స్వామి బైక్‌పై కాచాపూర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. గుమ్లాపూర్ శివారు దాటాక డాంబర్ ప్లాంటు, రైస్‌మిల్లు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. సతీశ్‌కు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయని ఎస్ఐ ఉపేంద్ర వివరించారు.

ప్రాణాలు కాపాడడమే ధ్యేయం

- ఆస్తుల పరిరక్షణకు చర్యలు
- రామగుండం సీపీ శ్రీనివాస్
- 'ఎల్లంపల్లి'లో ఫ్లడ్ రెస్క్యూ టీం డెమో


గోదావరి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, అధికారులు

రామగుండం: అకస్మాత్తుగా వచ్చే వరదలతో ప్రాణాలు కాపాడడం, ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఫ్లడ్ రెస్క్యూ టీం ముందుకు సాగుతోందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. రామగుండం సీపీ, మంచిర్యాల కలెక్టర్ సంతోష్‌తోపాటు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్)లోని సుశిక్షితులైన రెస్క్యూటీం ప్రతినిధులతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో బుధవారం డెమో నిర్వహించారు. గత వర్షాకాలంలో వరదలతో లోతట్టు ప్రాంతాల్లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు డెమో చేపట్టామని వివరించారు. ఇందు కోసం రామగుండం సీపీ, మంచిర్యాల కలెక్టర్, డీసీపీలతో ఒక బృందం ఏర్పాటు చేసి, ఫ్లడ్ ఎక్విప్‌మెంట్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వరద బాధితులను కాపాడేందుకు, రోడ్డు రవాణాకు ఆటంకం కలిగితే పునరుద్ధరించడం తదితర అంశాల్లో రెస్క్యూ సభ్యులకు శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం సీపీ, మంచిర్యాల కలెక్టర్, డీసీపీ, ఏసీపీలు రెస్క్యూ బోట్‌లో గోదావరి నదిలో శికారు చేశారు. బైనాక్యులర్‌లో ప్రాజెక్టు పరీవాహక ప్రాంతాన్ని వీక్షించారు. ఈ డెమోలో రామగుండం సీపీతోపాటు మంచిర్యాల కలెక్టర్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, గోదావరిఖని, మంచిర్యాల ఏసీపీలు రమేశ్, రత్నాపురం ప్రకాశ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నీటిలో మునిగిన వ్యక్తిని కాపాడుతున్న రెస్క్యూ టీం


స్ట్రెచర్‌పై బాధితుడిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రెస్క్యూ బృందం


బోట్‌లో ప్రయాణిస్తున్న రామగుండం సీపీ, మంచిర్యాల కలెక్టర్